నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | జనవరి 09, 2025 | www.navatelangana.com

జేసీబీతో చెట్ల తొలగింపు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-తాడ్వాయి

మూలమలుపులు మృత్యుదారులు అనే శీర్షికన నవతెలంగాణలో డిసెంబర్ 29న కథనం ప్రచురితం కాగా.. బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హారిక, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు ఆధ్వర్యంలో ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఉన్న చెట్లను జెసిబి సహాయంతో తొలగించి ఎత్తుగడ్డలను చదును చేశారు.



మూలమలుపు వద్ద జేసీబీతో చెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ దగ్గర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, ఆర్డీఓ రంగనాథ్ రావు, కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌లు అనిల్, ఇందిరా తదితరులున్నారు.



మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యిమెగావాట్ల ఉత్పత్తి
- త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎస్‌హెచ్‌జీల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు ప్రగతిపై సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలతో ముందుకెళ్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పి వేయి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య పరస్పర ఒప్పందం ఖరార య్యిందని తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండి కృష్ణ భాస్కర్ తదితరులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియపై ప్రగతిని సమీక్షించారు. ఐదు సంవత్సరాల వ్యవధిలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. ఈ దిశగా మహిళలకు పెద్దఎత్తున వడ్డీలేని రుణాలు అందజేస్తున్నామని గుర్తు చేశారు. ఈ ఆర్థిక చేయూతను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుంటూ సమర్థవంతమైన వ్యాపార లావాదేవీలతో ఆర్థిక పరిపుష్టి సాధించేలా అధికారులు తోడ్పాటును అందించాలని సూచించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటు కోసం వారికి అందుబాటులో ఉన్న స్థలాన్ని, ప్రభుత్వ భూములను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం ఇప్పించేలా చొరవ చూపాలన్నారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్‌కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలోనే వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో ఆసక్తి, అర్హత కలిగిన మహిళా సంఘాలను గుర్తించి, భూసేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం అందించే ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీఓ సాయాగౌడ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు, కామారెడ్డిలో కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా అటవీ అధికారిణి నిఖిత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్.ఈ. ఎన్.శ్రావణ్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి రజిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సమసమాజ స్థాపనకై ఉద్యమాలు నిర్మిద్దాం

- సీపీఐ(ఎం) నాయకుల పిలుపు
- రాష్ట్ర మహాసభల జయప్రదానికి విరాళాల సేకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమసమాజ స్థాపనకై ఉద్యమాలను నిర్మిద్దామని సీపీఐ(ఎం) నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణగంజ్‌లో చిరు వ్యాపారస్తులను, కార్మికులను, కలిసి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28 తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని చిరు వ్యాపారస్తులకు, సామాన్యులకు, కార్మికులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ దేశంలో నిబద్ధతతో పేద ప్రజల సమస్యలను పరిష్కరించే పార్టీ కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ అని కొనియాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 10 ఏండ్లు గడిచినా.. పేద ప్రజల సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ వ్యవస్థలకు ఊడిగం చేస్తుందని అన్నారు. దాంతో పాటుగా బడుగు బలహీన వర్గాల ప్రజలపై మతతత్వ రంగును పులిమి ప్రజల మధ్య అనైక్యతను సృష్టిస్తూ పబ్బం గడుపుకుంటుందని అన్నారు. అదేవిధంగా రాజ్యాంగాన్ని హేళన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో మతతత్వపు పోకడలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం)ని ఆదరించి ఈ మహాసభల జయప్రదానికి ప్రజలు సహకారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, నాయకులు నల్వాల నరసన్న, కటారి రాములు, ఉద్ధవ్, సతీష్, రాజు పాల్గొన్నారు.



విరాళాలను సేకరిస్తున్న నాయకులు

విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

విద్యుత్ షాక్ తగిలి రైతు మరణించిన ఘటన మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లారెడ్డి (61) వ్యవసాయ బావి వద్దకు పొలానికి నీళ్ల పారబెట్టడానికి వెళ్లి విద్యుత్ షాక్ తగిలి మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.



స్వచ్ఛంద సంస్థల సేవలు మరిచిపోలేనివి

- సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నవతెలంగాణ-బోధన్

లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సేవా ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు మరిచిపోలేనివని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన కూడా ప్రజలకు చేరడానికి సమయం పడుతుందని, అదే క్రమంలో స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని కొనియాడారు. అనంతరం పలు పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న సబ్ కలెక్టర్

అలరించిన చిత్రకళా ప్రదర్శన..

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో విద్యార్థులు గీసిన చిత్రాలతో ఏర్పాటు చేసిన చిత్ర కళా ప్రదర్శన ఆకట్టుకుంది. చిత్రాలను తిలకించిన సబ్ కలెక్టర్ వికాస్ మహతో చిత్రాలు గీసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, ఆదినారాయణ, రవికిరణ్, నగేష్‌బాబు, చిత్రకళా బోధకులు లింబూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలపై 10న ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నా

- సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నూర్జహాన్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశావర్కర్ల సమస్యలపై 10న ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నాలను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నూర్జహాన్ పిలుపునిచ్చారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం నిజామాబాద్ సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా ఆశా కార్యకర్తల సమస్యలపై శాసనసభలో చర్చించాలని కోరుతూ ఈనెల 10న ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నాలు చేపట్టాలని ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు ఆశావర్కర్లు నిరవధిక సమ్మె చేశారని, సమ్మె సందర్భంగా ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారని, కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని జనవరి 10న ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య రేవతి, అనిత, గీత, గౌరీ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

విద్యార్థులు వాహనాల రాకపోకలు గమనించి అప్రమత్తంగా వ్యవహరించాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి కె.శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట్)

రోడ్డు మీద నడిచే పాదాచారులు, విద్యార్థులు వాహనాల రాకపోకలు గమనించి అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా రవాణా శాఖ అధికారి కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజంపేట్ మండలంలోని బసవనపల్లి గ్రామంలో గల యస్.పి.ఆర్.కె పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ప్రసంగించారు. ప్రతి విద్యార్థి తమ కుటుంబ సభ్యులకు హెల్మెట్‌ను ధరించటం వల్ల అరికట్టగలిగే ప్రమాదాల గురించి చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన పాఠశాల యాజమాన్యానికి, సిబ్బందికి అభినందనలు తెలిపారు. వేరొక కార్యక్రమంలో భాగంగా మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజుద్దీన్, మహేష్‌లు భిక్కనూర్ టోల్‌గేట్ వద్ద వాహనాలకు రిఫ్లెక్టివ్ రేడియం స్టిక్కర్స్ ప్రాధాన్యతను వివరించారు. పలు వాహనాలకు రోడ్డు భద్రత ప్రాధాన్యత ప్రచార పత్రాలను వారి అంగీకారంతో వాహనాలకు అతికించారు.



మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి

జేపీఎస్‌లకు రెగ్యులర్ ఆర్డర్ ఉత్తర్వులు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి పట్టణ కేంద్రంలోని కలెక్టర్ కార్యా లయంలో బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి 13 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులర్ ఆర్డర్ ఉత్తర్వులను అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారం చేసే దిశగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ విక్టర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, డి.ఎల్.పి.ఒలు సురేందర్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు మహేష్‌గౌడ్, జనరల్ సెక్రటరీ హనుమండ్లు, రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిజాన్ని నిర్భయంగా రాయడంలో నవతెలంగాణది కీలక పాత్ర

నవతెలంగాణ-భిక్కనూర్

నిజాన్ని నిర్భయంగా రాయడంలో నవతెలంగాణ దినపత్రిక కీలక పాత్ర పోషిస్తుందని భిక్కనూర్ మండల తహసీల్దార్ శివ ప్రసాద్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలికి తీసి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమాజంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రోజా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, సర్వేయర్ కిరణ్, విలేకరి శ్యాంసుందర్, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

జీపీ కార్యదర్శులతో వారాంతపు సమావేశం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై బుధవారం మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక వారాంతపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీలకు పలు సూచనలు చేశారు. గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీఓ రాము, ఏపీఓ మస్తాజీ, ఈసీ స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

సైబర్ జాగృత దివాస్ సందర్భంగా బుధవారం సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విజన్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైళ్లు, బ్యాంకుల నుంచి నకిలీ కాల్స్, ఇన్వెస్ట్మెంట్స్ (స్టాక్) మోసాలు, డయల్ 1930 ప్రాముఖ్యత, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్ కానిస్టేబుల్ ప్రవీణ్, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ రోజ, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

నవతెలంగాణ-పొతంగల్

కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల, ఎంపిపిఎస్ పాఠశాలలను తహసీల్దార్ గంగాధర్ బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం డిసెంబర్ 2024లో మిడ్‌లైన్ పరీక్ష నిర్వహించగా.. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాలు

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ చౌరస్తా వద్ద, ప్రతిభా స్కూల్ విద్యార్థిని, విద్యార్థులతో రోడ్డు భద్రత మాసోత్సవాలు 2025ని పురస్కరించుకొని.. హెల్మెట్ వాడకం, సెల్ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలపై, వాహన చోదకులకు పట్టణ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూలు వితరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయ్ గ్రామ రామ్‌దాల్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్వాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు రూ.10,000 విలువ చేసే షూలు, సాక్స్‌లను యూత్ సభ్యులు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నర్సింలు విద్యార్థుల తరపున యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, స్వాతి మాల, రాందాల్ యూత్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ బుధవారం బోధన్ పట్టణంలోని రైస్‌మిల్ భవన్‌లో మేధావుల సంఘీభావ సభ కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. మాదిగ ఉద్యోగులు, పాత్రికేయ మేధావులు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 11వ తేదీన ఓయూలో నిర్వహిస్తున్న మాదిగ మేధావుల సదస్సును జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో బోధన్ డివిజన్ మాదిగ ఉద్యోగ మేధావులు కదులుతామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాదిగ మేధావుల కన్వీనర్లు తెడ్డు గంగారం, నాంపల్లి, కో కన్వీనర్ సురేష్, లింబూరి లక్ష్మణ్, సాయిలు, విజయ్, మల్లేష్, మల్లికార్జున్, అబ్బయ్య జ్ఞానేశ్వర్, రత్నాకర్, సంగీత్‌రావ్ పాల్గొన్నారు.

నవజాత శిశువులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న సబ్ సెంటర్లలో ప్రతి బుధవారం నవజాత శిశువులకు నిర్వహించే వైద్య పరీక్షలు ఆయా సెంటర్లలోని స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎంలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాక్సినేషన్, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గడపగడపకూ అభివృద్ధి ఫలాలు అందాలి

- మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్



నవతెలంగాణ-గాంధారి

గడపగడపకూ అభివృద్ధి ఫలాలు అందే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని గండిపేట్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి గడప గడపకు అందే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేశ్వర్, మమ్మయి సంజీవ్ యాదవ్, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌గౌడ్, నాయకులు సర్దార్‌సింగ్, సిందే రాంకిషన్, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సాయిబాబా, సర్దార్ నాయక్, కాశీరాం, మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లతగౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామారెడ్డి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఏఎస్‌పి చైతన్య రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఏఎస్పి చైతన్య రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లోని రికార్డులను, పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని క్రైమ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సై నరేష్ కు పలు సూచనలు చేశారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం రూ.5 లక్షల ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ... గ్రామాల అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్మోహన్రావు మండల అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్లకు నిధులు కేటాయించినందుకు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, కాంగ్రెస్ నాయకులు రంగు రవీందర్ గౌడ్, శిలా సాగర్, కిషన్ యాదవ్, నామాల రవి, మోహన్ నాయక్, జెసిబి శేఖర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో నగదు దోచుకెళ్లిన దుండగులు

నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట్)

రాజంపేట్ పట్టణ కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. బుధవారం ఉదయం ఆలయ నిర్వాహకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆలయంలో ఉన్న సిసి ఫుటేజీని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

- ప్రత్యేక అధికారి సయ్యద్ సాజిద్ అలీ

నవతెలంగాణ-తాడ్వాయి

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని ప్రత్యేక అధికారి సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బోరు మోటర్ బిగించినట్టు ప్రత్యేకాధికారి తెలిపారు. గత వారం రోజుల క్రితం బోరు మోటర్ చెడిపోవడంతో కాలనీవాసులకు నీటి ఇబ్బందులు రావొద్దనే ఉద్దేశంతో బోరు మోటర్ అమర్చినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు, కారోబార్ స్వామి, సిబ్బంది గంగారాం, బాలరాజ్ పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలానికి నూతనంగా మంజూరైన 108 వాహనంలో బుధవారం తెల్లవారుజామున మహిళ ప్రసవించింది. నాగిరెడ్డిపేట్ 108 వాహనానికి రాత్రి రెండు గంటలకు కాల్ రావడంతో గుండారం చేరుకున్న 108 సిబ్బంది మహిళ జయంతిని అంబులెన్స్ ఎక్కించుకొని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా దారిలో మహిళ ప్రసవించింది. మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు పైలట్ దళపతి తెలిపారు. దీంతో తల్లీ బిడ్డను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఈఎంటి అనిల్ తదితరులున్నారు.

ఆకస్మికంగా తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డెన్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా కళాశాలలో ప్రార్థన సమయంలో పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలలో పాస్ అయ్యే విధంగా తగు సూచనలు చేశారు.



ప్రార్థనలో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్

ఆటోడ్రైవర్‌కు ఒకరోజు జైలుశిక్ష

● అత్యధిక శబ్దంతో పాటలుపెట్టి ఆటో నడిపినందుకు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అత్యధిక శబ్దంతో పాటలు పెట్టి ఆటో నడిపిన వ్యక్తికి ఒకరోజు జైలు శిక్ష పడిందని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ రఘుపతి బుధవారం తెలిపారు. నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం వేకువజామున 3గంటల సమయంలో రైల్వే స్టేషన్ ప్రాంతంలో నగరంలోని ఆటోనగర్‌కు చెందిన షేక్ ముజామిల్ అత్యధిక శబ్దంతో పాటలు పెట్టి ఆటో నడిపిన వ్యక్తిని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి రఘుపతి అదుపులోకి తీసుకొని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. ఆటో నడిపిన వ్యక్తి అయిన షేక్ ముజామిల్‌కు న్యాయస్థానం ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు.

హామీలన్ని అమలు చెయ్యాలి

● మాజీ జడ్పీ చైర్మన్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-మాక్లూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్ని అమలు చెయ్యాలని కోరుతూ మాజీ జెడ్పి చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ శేఖర్ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఒక ఎకరనా రైతు భరోసా రూ. 15వేలు ఇవ్వాలని, రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చెయ్యాలని తెలిపారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు ఇవ్వాలని అన్నారు. రేషన్ కార్డ్ లేని రైతులకు రేషన్ కార్డు ఇచ్చి, రైతులకు క్రాప్ ఇన్సూరెన్సు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు నర్సా గౌడ్, మాజీ సర్పంచ్ అశోక్ రావు, మండల కో ఆప్షన్ హైమద్, రమణ రావు, శ్యామ్ రావు, రఘు, దర్గాల సాయిలు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్ఐ


మాట్లాడుతున్న ఎస్ఐ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవల్లో భాగంగా భీంగల్ లోని ఎలిజే ఫంక్షన్ హాల్లో ఆటో యూనియన్, డ్రైవర్స్ అందరితో రోడ్డు భద్రత మీద అవగాహనా కల్పించి తగు జాగ్రత్త లు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఈసందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ.. సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని, ఓవర్ లోడ్‌తో జనాలను ఎక్కించుకోవద్దని తెలిపారు. ఓవర్ టేక్ చేసే క్రమంలో జాగ్రత్త వహించాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని అన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహనా కల్పించారు. ఎవరైనా పోలీసులమని ఫోన్ చేస్తే నమ్మవద్దని, దగ్గర ఉన్న పోలీస్ స్టేషన్ లో ఇన్ఫాం చేయాలని తెలిపారు. తెలియని వ్యక్తులకు మీ ఓటీపీ లేదా వ్యక్తిగత వివరాలు తెలపకూడ్దన్నారు. 1930 కి కాల్ చేయాలని అన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అనిల్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు సైబర్ సురక్షిత, జాతీయ భద్రత అనే అంశంపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని సైబర్ నేరాలను గురించి వివరిస్తూ వాటి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఇటీవల జరిగిన సైబర్ నేరాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వాటి గురించి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి ఇటువంటి మోసాల బారిన పడకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆన్లైన్ మోసాలతో ఎంతోమంది తమ జీవితాలను కోల్పోతున్నారని, వాటి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయని, భవిష్యత్తులో ఏ విధంగా జరుగుతాయో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఎస్ఐ వివరించారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి తల్లిదండ్రులకు వివరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అత్యంత క్లిష్టమైన గుండె ఆపరేషన్

● వెల్లడించిన హాస్పిటల్ వైద్యులు



మాట్లాడుతున్న హాస్పిటల్ వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అత్యంత క్లిష్టమైన గుండె ఆపరేషన్‌ను నిజామాబాద్ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు చేసినట్లు బుధవారం తెలిపారు. 16 సంవత్సరాలక్రితం జరిగిన ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ అయిన నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం బెజ్జోరా గ్రామానికి చెందిన 60 సంవత్సరాలు వయస్సు గల గంగారం అనే వ్యక్తి డిసెంబర్ ఆరో తారీఖున చాతి నొప్పి దమ్ముతో మెడికవర్ హాస్పటల్‌కి వెళ్లారు. ఎమర్జెన్సీలో డా.రవి కిరణ్ ఇనెట్వెన్షన్ కార్డియాలజీస్ట్ ఏంజియోగ్రమ్ చేసి 16 సంవత్సరాల క్రితం జరిగిన ఆపరేషన్ వద్ద మళ్ళీ ఇబ్బంది వచ్చిందని నిర్ధారించి మళ్ళీ అటువంటి ఆపరేషన్‌ని చేయాలని డా. అవీన్ సనర్ కార్డియో థొరాసిక్ సర్జన్‌కి తెలిపారు. డా.అవిన్ సనర్ పేషంట్ బంధువులకు ఆపరేషన్ రిస్క్ తెలియజేసి వాళ్ల అంగీకారంతో ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ జరిగిన 6 వ రోజు పేషంట్‌ని డిశ్చార్జ్ చేయటం జరిగిందని డాక్టర్ అవిన్ సానర్ అన్నారు. అనంతరం డా.వసు అనేస్తీషియ మాట్లాడుతూ.. ఇలాంటి హై రిస్క్‌తో కూడిన ఆపరేషన్ నిజామాబాద్ జిల్లాలో మొట్ట మొదటి సారి మెడికవర్ హాస్పటల్‌లో జరిగిందన్నారు. సెంటర్ హెడ్ స్వామి మాట్లాడుతూ.. మెడికవర్ హాస్పటల్స్ నిజామాబాద్‌లో నెలకి 15 నుండి 20 ఓపెన్ హార్ట్ ఆపరేషన్ చేస్తున్నామని అన్నారు. సమావేశంలో డాక్టర్ యజ్ఞ, డిఎంఎస్ మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

● మామిడిపల్లి వార్డులో ఘటన

నవతెలంగాణ-ఆర్మూర్

మహిళ మెడలో నుంచి చైన్ అపహరించిన ఘటన మండలంలోని మామిడిపల్లి 8వ వార్డులో చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి లక్కారం రుకుంబాయి అనే మహిళ బీడీ కార్ఖానాలో పని ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వస్తున్నారు. వెనుక నుండి వచ్చిన దొంగ ఆమె మెడలోనుంచి మూడు తులాల చైన్ లాక్కుని ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని సుభాష్ నగర్ అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ జిల్లా విద్యశాఖ ఉన్నత అధికారులతో సమీక్షా నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అధ్వాంగా ఉందని, కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించడం లేదని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నాణ్యమైన విద్య అందకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మిడ్డే మిల్స్ అందించాలని, అలాగే నాణ్యమైన విద్య అందించాలని అన్నారు, నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులపైన కఠిన చర్యలు తీసుకోవాలని విద్యశాఖ అధికారులకు ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరానికి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా తల్లితండ్రుల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దేలా కృషి చేయాలని అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మన ఊరు-మన బడి ద్వారా వచ్చిన నిధులు, వాటి వివరాలు, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన అమ్మఆదర్శ పాఠశాలల పథకం ద్వారా వచ్చిన నిధులు, పనుల వివరాలు, పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ అధికారి అశోక్ కుమార్, నార్త్ , సౌత్ మండల ఎంఈఓ లు, విద్యాశాఖ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల ప్రారంభానికి కృషి చేస్తా..

అహ్మది బజార్, ఖలీల్ వాడిలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అహ్మది బజార్‌లో 9 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు పూర్తి అయ్యి దాదాపు రెండు సంవత్సరాలు అవుతున్న ప్రారంభం కాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. 97 షెటర్స్‌తో నిర్మాణం అయిన మార్కెట్ నాన్‌వెజ్‌కు 38, జనరల్‌కు 59 చొప్పున విధివిధానాలకు లోబడి కేటాయింపులు జరుగుతాయని, ప్రజలకు త్వరలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఖలీల్ వాడిలోని మల్టీ పుల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు 4.50 కోట్ల వ్యయంతో దాదాపు పూర్తి కావడం జరిగిందని అన్నారు. మిగిలిన పనులకు 1.50 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో పనులు పూర్తి చేసేల చర్యలు తీసుకొని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం అన్నారు. మల్టీపుల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నాన్‌వెజ్ 32, ఫ్లవర్, ఫ్రూట్స్ 16, వెజ్ 64 స్టాల్స్ ను మున్సిపల్ విధివిధానాలకు లోబడి కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. మార్కెట్ల ప్రారంభం ఆలస్యానికిగల కారణాలు కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు, చట్టపరమైన విధివిధానాలు పూర్తి చేసి అతి త్వరలో మార్కెట్ ప్రారంభనికి కృషి చేయాలని సూచించారు. ప్రజా ఆరోగ్యం, అవసరాలకు అనుగుణంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను త్వరలో ప్రారంభించేలా కృషి చేస్తానని, దీనికి అందరు సహకరించాలని కోరారు. నిజామాబాద్ కార్పొరేషన్‌ను తెలంగాణలో ఆదర్శవంతంగా మొదటి స్థానంలో నిలబడేలా కృషి చేయాలన్నారు. దీనికి నగర ప్రజలందరు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ మురళి, అర్అండ్బీ డిపార్ట్మెంట్ ఏఈ సాయి కుమార్, మున్సిపల్ రిటైర్డ్ ఈఈ రషీద్, మున్సిపల్ సిబ్బంది, బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగతిసింగ్ దల్లేవాలకు ఏమైనా.. బాధ్యత కేంద్రప్రభుత్వానిదే

● ఏఐకేఎంఎస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జగతిసింగ్ దల్లేవాల ఆరోగ్యానికి ఏమి ముప్పు ఏర్పడిన కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి అని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. ఎంఎస్పి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, నూతన వ్యవసాయ విధానాలను విరమించుకోవాలని, రైతు ఉద్యమానికి మోడీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని 45 రోజులుగా స్వయాన రైతు నాయకులు ఎస్కేఎంఎస్ జాతీయ నాయకులు జగదీష్ సింగ్ దల్లేవాల ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని అన్నారు. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుందని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య అన్నారు. వీరికి ఏమాత్రం ముప్పు జరిగినా అది కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన అన్నారు. దల్లేవాల నిరాహార దీక్షకు మద్దతుగా, మోడీ ప్రభుత్వానికి నిరసనగా జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగ వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోసం, పంటల గిట్టుబాటుకై కనీస మద్దతు ధర కోసం ఏడాదికి పైగా రైతులు దేశ రాజధాని ఢిల్లీ చుట్టూ సింగు, డిగ్రీ, ఘాజాపూర్ ధర్నా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. . రైతుల డిమాండ్ల నెరవేరుస్తామని మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చి దీర్ఘకాలిక ఆందోళనను విరమింపజేసిందని తెలిపారు. కానీ ఆ హామీలను నేడు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రైతాంగ నాయకుడు జగత్ సింగు దలియవాల్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారన్నారు. కనీస మద్దతు ధర చట్టాన్ని ఇకనైనా రూపొందించాలని, రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, జిల్లా నాయకులు అగ్గు ఎర్రన్న బి.సాయిలు, రాపని గంగాధర్, శివకుమార్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నాయకులపైన దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి పోలీసులను కోరారు. హైదరాబాద్ నాంపల్లి బిజెపి పార్టీ ఆఫీస్ పైన కాంగ్రెస్ నాయకులు దాడి చేసిన సందర్భంగా బధవారం నిజామాబాద్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా డీసీసీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడికి పిలుపు నిచ్చారు. మొదట నిఖిల్ సాయి చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనంచేసి పెద్ద ఎత్తున బిజెవైఎం కార్యకర్తలు డీసీసీ భవన్ ముట్టడికి బయలుదేరారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. ఖబర్దార్ కాంగ్రెస్ నాయకుల్లారా బిజెపి నాయకులు అంటే బిజెపి కార్యకర్తలు అంటే చులకనగా చూస్తున్నారని, బిజెపి కార్యకర్తలకు సంస్కారం ఉందని, మా పార్టీ అలాంటి దాడులు నేర్పలేదని అన్నారు. ఎవరైతే మా నాయకులపైన దాడి చేశారో వారిని కఠినంగా శిక్షించాలని పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. మరలా ఇది రిపీట్ అయితే తప్పకుండా దాడికి ప్రతి దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాదాల నరేష్, పల్నాటి కార్తీక్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆమంద్ విజయ్ కృష్ణ, ఉపాధ్యక్షులు నాగ సురేష్, విపుల్ రావు,బీజేవైఎం నాయకులు అశోక్, రామకృష్ణ, దినేష్,మిగతా బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ విద్యార్థులు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని తెలిపారు. గురుకులాల్లో విద్యను అభ్యసించదల్చిన బాలబాలికలు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్లైన్‌లో ఫిబ్రవరి 01వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆదాయ ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆధార్ కార్డు నెంబరు, బర్త్ సర్టిఫికెట్, ఫోటో అవసరమని తెలిపారు. పై ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం, గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతిలో ప్రవేశాలకోసం, ఖమ్మంలోని గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలో ఎస్ఓఈలలో 8వ తరగతిలో ప్రవేశాలకై, అలుగునూరులోని సిఓఈలో 9వ తరగతిలో అడ్మిషన్లకోసం, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తిగల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లా బిసి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర కాలమానిని ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బుధవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కరిపే రవీందర్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, సలహాదారులు బుస ఆంజనేయులు ఆకుల ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిచందర్, కార్యవర్గ సభ్యులు దారం భూమన్న, కరిపే మధుసూదన్, సుధాకర్, డాక్టర్ విజయభాస్కర్, అతిథులుగా టీఎన్జీవోస్ అధ్యక్షులు సుమన్ కుమార్, కార్యదర్శి శేఖర్, బిసి ఉద్యోగ సంఘం నాయకులు సిరప గోవర్ధన్, ఉత్తం, భోజన్న, పాల్గొన్నారు.

ఖబడ్దార్ బిజెపి నాయకుల్లారా...

● యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు

● బిజెపి మాజీ ఎంపీ దిష్టిబొమ్మ దహనం


కంఠేశ్వర్:దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/బాల్కొండ/ మెండోరా/జక్రాన్‌పల్లి

రమేష్ బిదురి ప్రియాంక గాంధీపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు మోయిన్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా వారు భరతమాత చిత్రపటాన్ని పట్టుకొని బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు మొయినుద్దీన్, కార్పొరేటర్ గడుగు రోహిత్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, సేవాదళ్ యువజన విభాగం అధ్యక్షుడు హర్షద్, నవాజ్, మాట్లాడుతూ.. రమేష్ బిదొరి అనే సంస్కారం లేని నీచుడు ప్రియాంక గాంధీ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు బిజెపి నాయకులకు స్త్రీల పట్ల వారికి ఉన్న కుసంస్కారాన్ని మరోసారి బట్టబయలు చేసిందని అన్నారు. బిజెపి పార్టీ అంటేనే హత్యలు, అత్యాచారాలు దోపిడీలు చేసేవారని, వారు దేశం గురించి ధర్మం గురించి మహిళల గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. గతంలో అత్యాచారం చేసిన చాలామంది వ్యక్తులకు బిజెపి పార్టీ ఎంపీలుగా ఎమ్మెల్యేలుగా కేంద్ర మంత్రులుగా టికెట్లు ఇచ్చి మరి ప్రోత్సహించిందని, అలాంటి వ్యక్తులకు మహిళల పట్ల గౌరవం ఎలా ఉంటుందని వారు అన్నారు. బిజెపి నాయకులు రమేష్ బీదొరి చేసిన వ్యాఖ్యలకు ఏమాత్రం పశ్చాత్తాప పడకుండా సిగ్గు లేకుండా నిన్న హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమం చేసిన మా యూత్ కాంగ్రెస్ సోదరులపై దాడి చేయడమే కాకుండా ఇవాళ నిజామాబాద్ ఆఫీస్ ముట్టడికి యత్నించారని అన్నారు. కేవలం మేము ప్రభుత్వంలో ఉన్నామని బాధ్యతాయుతంగా వ్యవహరించి మా నాయకులు ఇచ్చిన సందేశంతో సంయమనంతో ఉన్నామని లేకుంటే ఒక్క బిజెపి నాయకుడు కూడా రోడ్డుపై తిరగకుండా చేస్తామని వారు హెచ్చరించారు. ఇంకోసారి ఎవరైనా బిజెపి నాయకుడు స్త్రీల పట్ల గాని కాంగ్రెస్ నాయకుల పట్ల గాని తప్పుడుగా మాట్లాడితే నాలుకలు చీరేస్తాం ఖబర్దార్ అని వారు హెచ్చరించారు. తక్షణమే బిజెపి పార్టీ హై కమాండ్ రమేష్ బీదొరిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, అలాగే బిజెపి పార్టీ అగ్ర నాయకులు రమేష్ బీదొరి చేసిన వ్యాఖ్యలకు సంపూర్ణ బాధ్యత వహించి ప్రియాంక గాంధీకి క్షమాపణ చెప్పాలని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు రషీద్, పవన్ కాక , అక్రమ్, సాయికిరణ్, శివ, రేవంత్, ముదస్సిర్, అతీఫ్, మినాజ్ పాల్గొన్నారు.

బాల్కొండ: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై బిజెపి మాజీ ఎంపీ రమేష్ భీధురి చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గున్నాల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని వన్నెల్ బి ఎక్స్ రోడ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రమేష్ భీధురి దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రియాంక గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ గ్రామ శాఖ అధ్యక్షులు సంజీవ్ గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, పార్టీ నాయకులు గుండేటి మోహన్ రెడ్డి, యూనుస్, మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ జావిద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తౌట్ అరవింద్, ఉపాధ్యక్షుడు విక్కీ, నాయకులు పాల్గొన్నారు.

మెండోర: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీపై బీజేపీ నేత రమేష్ బీదురి చేసిన అనుచిత వ్యాఖ్యలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యం రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో వివేకానంద చౌరస్తా వద్ద బీజేపీ నేత రమేష్ బీదురి దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం కొత్తింటి.ముత్యం రెడ్డి మాట్లాడుతూ మహిళలంటే కనీస గౌరవ , మర్యాద లేని వ్యక్తికి బీజేపీ పార్టీ టికెట్ ఇచ్చి వారికి ఓట్లు వేయమని అడగటం సిగ్గుచేటని అన్నారు. రమేష్ బిదూరి వాక్యాలను వెంటనే వెనక్కి తీసుకుని ప్రియాంక గాంధీ కి క్షమాపణ చెప్పాలని అన్నారు. బీజేపీ పార్టీ నుండి రమేష్ బిదూరి ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పక్కన పెట్టి మత విద్వేషాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు గుండోజీ.రవి , మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుభాష్, కొప్పెల రమేష్, జక్కుల శ్రీనివాస్, నుతుల శ్రీనివాస్, నోముల శ్రీనివాస్, నేల్ల లింగన్న, గంగారెడ్డి, వరిగడ్డి రవి, సామ నరేష్, నవీన్, ముత్యం, రాజన్న, భూమేష్, బాలు, ప్రమోద్, గుర్రం గంగాధర్, శ్రీనివాస్ గౌడ్, అనిల్, ప్రభాకర్, సుమన్, సతీష్, ప్రతాప్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: కాంగ్రెస్ నేత ఎంపీ ప్రియాంక గాంధీ పై బిజెపి నేత మాజీ ఎంపీ రమేష్ బిదురి అభ్యసభ్య వాక్యాలు చేయడాన్ని నిజాంబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్ తీవ్రంగా ఖండించారు. రమేష్ బిదురిపై బిజేపీ హైకమాండ్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవ్యాఖ్యలపై బిజెపి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని అన్నారు. ఆయన వ్యాఖ్యలు మహిళల పట్ల బిజెపి సంకుచిత మనసత్వ ధోరణి బయటపడుతుందని విమర్శించారు. ఢిల్లీ ఎన్నికల సమయాల్లో వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బిజెపి ఉద్దేశపూర్వకంగా ఇలాంటి వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తుందని విమర్శించారు. బిజెపి నిజమైన స్వభావం వ్యవహార శైలి ఎజెండా వంటి విషయాలను ఈ ఘటన చాలా స్పష్టంగా వెల్లడించిందని పేర్కొన్నారు. రమేష్ బిదురి వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళనలు ఇస్తామని పేర్కొన్నారు.

9న పసుపు పరిశోధన స్థానంలో రైతులతో ముఖాముఖి

● పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 9న మండలకేంద్ర శివారులోని కొండా లక్ష్మణ్ బాపూజీ పసుపు పరిశోధన స్థానంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులతో ముఖాముఖి నిర్వహించే ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సులర్ రాజిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. పసుపు రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉదయం 10గంటల నుండి 11:30 గంటల వరకు ఉంటుందని, పెద్ద ఎత్తున పసుపు రైతులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

కెజిబివీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ఆకస్మికంగా సందర్శించిన ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్ బుధవారం భీంగల్‌లోని కేజీబీవీ పాఠశాలను, కళాశాలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సిలబస్ పూర్తి, భోజన మెనూ, బాత్రూం , టాయిలెట్స్ నీట్ గా ఉన్నాయో లేవో పరిసరాల శుభ్రత, హాస్టల్ రూమ్స్ క్లాస్ రూమ్స్ తదితర అంశాలను పరిశీలించారు. కేజీబీవీలో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌క నివేదించడం జరుగుతుందని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో స్వామి, కేజీబీవీ అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదుదారుల ఫీడ్ బ్యాక్ సేకరణ

● ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సింధు శర్మ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజల సౌకర్యార్థం కోసం క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు దారుల ఫీడ్ బ్యాక్ సేకరణ జరుగుతుందని ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సింధు శర్మ వెల్లడించారు. ఈ క్యూఆర్ కోడ్ పద్ధతిని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 9న రాష్ట్ర డిజీపి కార్యాలయం నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్ వలన పోలీసుల గురించి ప్రజల నుంచి వారి అభిప్రాయాలను సేకరించడం కోసం ఏర్పాటు చేసినట్టు సూచించారు. ఈ క్యూఆర్ కోడ్ పోస్టర్లు జనరద్దీ గల ప్రదేశాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కావున పౌరులు ఈ క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ ఉర్దూ మీడియం పాఠశాల, 3 అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నాణ్యమైన భోజనాన్ని అందించాలని భోజన ఏజెన్సీ కార్మికులకు సూచించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలోని 3 అంగన్వాడీ కేంద్రాలను సైతం సందర్శించి చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పత్రికలు

- ఎంపీడీవో తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజలకు, ప్రభుత్వానికి వార్త పత్రికలు వారధిగా పనిచేస్తున్నాయని ఎంపీడీవో తిరుపతిరెడ్డి అన్నారు. పేదల పత్రికగా నవతెలంగాణ పనిచేస్తుందని, నిజాలను నిర్భయంగా రాసే పత్రిక నవ తెలంగాణ అని ఆయన తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నవతెలంగాణ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆవిష్కరణలో నవతెలంగాణ రికవరీ ఇంచార్జ్ భాస్కర్, విలేకరి తిరుపతిరెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మోహన్, నరేష్, శ్రీనివాస్, నవీన్, పంచాయతీ కార్యదర్శులు సాగర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో బుధవారం ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై ఆయన పాఠశాల బాల బాలికలతో పాటు యువకులకు సహా ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు, కళాశాలకు రోజువారీగా హాజరై విద్యార్థి విద్యార్థులే కాకుండా, ఉపాధ్యాయులు యువకులు సైతం ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటిస్తే ప్రమాదాలు జరగబోవని సూచించారు. బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఎడపల్లి గ్రామం ఉన్నందున, ఎడపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఆంగ్ల మాధ్యమంతో పాటు, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, అలాగే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, కేజీబీవీ, తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలతో పాటు కళాశాల ఉన్నందున, రాకపోకలు సాగించే ప్రయాణికులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. పాఠశాలకు కళాశాలకు వచ్చే బాల బాలికలు సైతం పోలీస్ చట్టం నియమ నిబంధనల ప్రకారం నియమ నిబంధన తప్పకుండా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ఎలాంటి వాహనదారులు, పాఠశాల బాలబాలికలు ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ఆయన గుర్తు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అయితే స్థానిక పోలీసులకు సంబంధిత బాలబాలికలతో పాటు స్థానిక ఉపాధ్యాయులు యువకులు సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు. తమ వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తామని ఎస్సై వంశీకృష్ణ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి సాయిలుతో పాటు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల బాలబాలికలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌సైన్స్, కళాశాలను

సందర్శించిన బీఈడీ విద్యార్థులు

- తెలంగాణ యూనివర్సిటీ బీఈడీ విద్యార్థులు



కళాశాలను సందర్శించిన బీఈడీ విద్యార్థులు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

తెలంగాణ యూనివర్సిటీ బీఈడీ కాలేజీ విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిలు, యోగ ప్రాజెక్ట్ ఇన్చార్జ్ డాక్టర్ ఆర్.కరుణాకర్ ఆధ్వర్యంలో బుధువారం రుద్రూర్ అక్బర్‌నగర్‌లోని ప్రకృతి ఆశ్రమాన్ని సందర్శించారు. ఫౌండర్ రామకృష్ణ మార్నింగ్ తమ ప్రకృతి ఆశ్రమంలో ప్రజలకు ఆరోగ్య పరమైన ఆహార నియమాలను, జీవన విధానాలను, యోగాసనాలను గురించి వివరించారు. మానవులకు సహజంగా వచ్చే రోగాలు డయాబెటిక్, బిపి, థైరాయిడ్, సయాటికా, వాటికి సంబంధించిన ఆసనాలను ఆశ్రమ ఇన్చార్జి యోగ సాయిలు స్వయంగా చేసి చూయించారు. విద్యార్థులు ప్రత్యక్షంగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వారిని అధ్యాపకులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. అనంతరం రుద్రూర్‌లోని ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ యూనివర్సిటీని సందర్శించి అక్కడ కల్తీ ఆహారం ఏ విధంగా తయారు చేస్తున్నారు, ఏ పాత్రలో వంట చేసుకోవాలి, కూరగాయలు ఎంత పరిమాణంలో కట్ చేయాలి, సమతుల్య ఆహారం, న్యూట్రిషన్స్, ప్రోటీన్స్, కార్బోహైడ్రేట్స్ వాటి గురించి అసోసియేట్ డిఎన్.కల్పన, డాక్టర్ పద్మజ, శ్రీలత వివరించారు. కళాశాల వాతావరణాన్ని విద్యార్థులు చూసి ఆనందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస్, డాక్టర్ సువర్చల, డాక్టర్ శ్రీకాంత్, నరసింహారెడ్డి విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐకెపీ, విఒపి ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరించిన ఐకెపీ, విఒపి ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని కళాభారతిలో బుధవారం నిర్వహించిన ఐకెపీ, విఒపి ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విఒపి చేసిన పోరాటాలు ఎన్నో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వారికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, వీఓఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్ గౌస్ ఖాన్, వీఓఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మనోజ్ శివరాం నాయక్, జిల్లా మండల కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-రెంజల్

నేటి సమాజంలో సైబర్ నేరాల వల్ల అమాయక ప్రజలు మోసపోతున్నారని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రెంజల్ ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. బుధవారం మండలంలోని సాటాపూర్, వీరన్నగుట్ట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇటీవల ఆన్లైన్ మోసాలతో ప్రజలు నష్టపోతున్నారని, బ్యాంకు అధికారులంటూ, తమ ఓటీపీ నెంబర్ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అటువంటి వారికి ఓటిపి చెప్పకూడదని ఆయన పేర్కొన్నారు. ఓటిపి చెప్పిన మరుక్షణమే తమ బ్యాంకు ఖాతాలోని డబ్బులు మాయమవుతాయని, ఆన్లైన్ మోసా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని కష్టపడి చదువుకోవాలని, ఇటీవల ప్రభుత్వం ఇంటర్నల్ మార్క్సను తొలగించిందని, విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇచ్చి పరిష్కారం చూపాలి

- షుగర్ ఫ్యాక్టరీ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి



వినతి పత్రాన్ని అందజేస్తున్న యూనియన్ నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

2015 డిసెంబర్ 23 నుంచి నేటి వరకు లే ఆఫ్ కాలానికి వేతనాలు ఇచ్చి పరిష్కారం చూపాలని, త్వరలోనే ఫ్యాక్టరీని ప్రారంభించి ఇటు కార్మికులను, రైతాంగాన్ని ఆదుకోవాలని ఎన్‌డిఎస్ఎల్ బోధన్, మెదక్, మెట్‌పల్లి కార్మికులు ఎన్ఎస్ఎఫ్ కోర్ కమిటీ అధికారి, హైదరాబాద్ షుగర్ భవన్‌లో చైర్మన్ రమేష్‌బాబు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పునరుద్ధరణలో భాగంగా రూల్‌లో ఉన్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, వివిధ సమస్యల మీద వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ మజ్దూర్ సభ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.ఉపేందర్, శంభు ప్రసాద్, సిద్ధి రాములు, జాకబ్, కిషన్, రాజయ్య, ముత్తయ్య, రాజయ్య కళ్యాణ్, నరహరి, జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయండి



మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ దీపాదాస్ మున్షి జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావుకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతా రావు వారి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన విధానాల గురించి చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని దీపాదాస్ మున్షీ ఎమ్మెల్యేకు సూచించారు.

బీసీ డిక్లరేషన్ 42 శాతం అమలు చేయాలి

నవతెలంగాణ-తాడ్వాయి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్న హామీని నెరవేర్చాలని కోరుతూ రాష్ట్ర మోర్చా అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోర్చా మండలాధ్యక్షులు దాత్తాత్రేయ ఆధ్వర్యంలో తహసిల్దార్ రహీముద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మర్రి బాపురెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్రావు, అంకాలపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎం. యాదగిరి, డాక్టర్ రమేష్, నాయి నరసింహులు, ఆనంద్ ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- హామీల అమలులో విఫలం
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు రైతుల ఇచ్చిన హామీలు అమలు చేయటంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించారు. చందూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాధవరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రజలు, రైతులు సంక్షేమ పథకాలు పొందారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను పక్కాగా అమలు చేశారని వివరించారు. ప్రజలకు డబుల్ బెడ్ రూమ్‌లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ఇచ్చిన ఏకైక వ్యక్తి కెసిఆర్ అని తెలిపారు. ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, లేని పక్షంలో ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీమన్నారాయణ, గంగాడోళ్ళ సంజవ్, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

యువత క్రీడల్లో రాణించాలని ఎస్‌ఐ మహేందర్, ఎంఈఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని కాటేపల్లి గ్రామంలో బుధవారం కాటేపల్లి ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. అనంతరం ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత పొంది రాణించాలని అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీ ప్రదర్శనలు చూపి, భవిష్యత్తులో ఇలాంటి రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి పెద్దకొడప్‌గల్ ప్రాంతానికి మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని, ఓడిపోయినా నిరుత్సాహం పడకూడదని గెలిచాము అని గర్వపడవద్దని స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలన్నారు. ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహేందర్, ఎంఈఓ ప్రవీణ్ కుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బాలరాజ్, పంచాయతీ సెక్రటరీ ప్రదీప్, గ్రామస్తులు మల్లప్ప పటేల్, ముగ్గుల గౌడ్, గ్రామస్తులు ఆయా ప్రాంతంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

గోకుల్ తాండను పోసానిపేట్ లేదా రామారెడ్డి సొసైటీలో చేర్చాలి

- ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గోకుల్ తండాను ఉప్పల్వాయి సొసైటీలో చేర్చనున్నట్లు తెలియడంతో, పోసానిపేట్ లేదా రామారెడ్డి సొసైటీలో చేర్చాలని బుధవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల మదన్మోహన్‌రావు పిఏకు గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ నాయక్ మాట్లాడుతూ.. గోకుల్ తాండ గతంలో పోసానిపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉండేదని తండావాసులకు పోసానిపేట సౌకర్యంగా ఉంటుందని, లేదంటే మండల కేంద్రమైన రామారెడ్డి సొసైటీలో తాండ గ్రామపంచాయతీని చేర్చే విధంగా ఎమ్మెల్యే కృషి చేయాలని గ్రామ స్తుల తరపున విన్నవిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వసంత్ నాయక్, కారోబారి గంగారం, బాలు నాయక్, రవి నాయక్, హరిచంద్రనాయక్, సుభాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ బుధవారం బోధన్ పట్టణంలోని రైస్‌మిల్ భవన్‌లో మేధావుల సంఘీభావ సభ కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. మాదిగ ఉద్యోగులు, పాత్రికేయ మేధావులు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 11న ఓయూలో నిర్వహిస్తున్న మాదిగ మేధావుల సదస్సును జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో బోధన్ డివిజన్ మాదిగ ఉద్యోగ మేధావులు కదులుతామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాదిగ మేధావుల కన్వీనర్లు తెడ్డు గంగారం, నాంపల్లి, కో కన్వీనర్ సురేష్, లింబూరి లక్ష్మణ్, సాయిలు, విజయ్, మల్లేష్, మల్లికార్జున్, అబ్బయ్య, జ్ఞానేశ్వర్, రత్నాకర్, సంగీత్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కంటి వైద్య నిపుణులు రవీంద్ర పాటిల్ కంటి సమస్యతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్య తీవ్రంగా ఉన్నవారికి మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అనంతరం మందులు అందజేసి వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని సూచించారు.

ఎస్సైని సన్మానించిన ప్రథమ చికిత్స వైద్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని ప్రథమ చికిత్స వైద్యులు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులును బుధవారం శాలువాతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ఎంపి, పీఎంపీ అధ్యక్షులు సత్యనారాయణ, పట్టణ వైద్యులు గంగాధర్, సుదర్శన్, ఆంజనేయులు, రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తుక్కోజివాడి, దగ్గి గ్రామంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్ మోహన్ ఆదేశాల మేరకు బుధవారం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ స్థానిక గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని తుక్కోజివాడి దగ్గి గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న సదాశినగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, తుక్కోజువాడి గ్రామ అధ్యక్షుడు రాజయ్య, తగ్గి గ్రామ అధ్యక్షులు సంతోష్, తుక్కోజివాడి ఉపాధ్యక్షులు రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

నవతెలంగాణ-బోధన్

వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బోధన్ పట్టణంలోని మధుమలాంచ హైస్కూల్, సాలూర మండలం జడ్పీ హైస్కూల్‌లో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాలూర హెచ్‌ఎం విజయ్ కుమార్, నరేందర్, ఉపాధ్యాయులు జయంతి, హేమలత, సతీష్ కుమార్, సుధారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పలువురు

బాగేపల్లిని సందర్శించిన నీటిపారుదల శాఖ అధికారులు



మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామాన్ని బుధవారం నీటిపారుల శాఖ అధికారులు సందర్శించి అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా బాగేపల్లి గ్రామ చెరువు నీటిని నింపడానికి ప్రతిపాదనలను తయారు చేశారు. ఇటీవల మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డిని గ్రామస్తులు కలిసి తమ చెరువు ల్లోకి అలీసాగర్ నీటిని వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించి నేడు నీటిపారుదల శాఖ అధికారులను పంపించారని రెంజల్ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు ఆగంటి సురేందర్‌గౌడ్ తెలిపారు. అలీసాగర్ ఫస్ట్ స్టేజీ నుంచి బాగేపల్లి చెరువులోకి నీటిని తరలించడానికి అనుకూలమైన స్థలాన్ని వారు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఇంచార్జ్ ఈఈ బలరాం, ఏఈ బుజేందర్, స్థానిక రైతులు ఆగంటి సాయిబాబా గౌడ్, సాయగౌడ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఉప్పల్వాయి గురుకుల క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

నవతెలంగాణ-రామారెడ్డి

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడాకారులు ఎంపికైనట్లు బుధవారం గురుకుల ప్రిన్సిపాల్ శివరాం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల డిసెంబర్‌లో ఖమ్మం, నాగర్‌కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్-అండర్ 14, ప్రాసస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీల్లో ఉపల్వాయి గురుకులానికి చెందిన కె.ప్రవీణ్, కె.సంకేత్, ఏ దిల్సన్, డి.సంతోషలు బంగారు పతకాన్ని సాధించారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొనున్నట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్‌తో పాటు, ఉపాధ్యాయ, అధ్యాపక బృందం అభినందించారు.

మధ్యాహ్నం భోజనం పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల కోసం వండి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజు మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యత కూడిన భోజనాన్ని అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజనం కోసం అందించే సరుకుల్లో నాణ్యత లోపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆయన పాఠశాల రికార్డులను పరిశీలించారు.తరగతి గదులను సందర్శించిన ఎంపీడీవో శ్రీనివాస్ విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు మాసం శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సొసైటీని విభజన చేయాలని వినతి

నవతెలంగాణ-మాక్లూర్



మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మాక్లూర్, కల్లేడి, గొట్టుముక్కల, చిక్లీ నాలుగు సంఘాలుగా విభజించాలని కోరుతూ సొసైటీ చైర్మన్ బురోల్ల అశోక్ ఆధ్వర్యంలో పాలక వర్గం సభ్యులు బుధవారం ఆర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ బురోల్ల అశోక్ మాట్లాడుతూ మాక్లూర్ సహకార సంఘం 26 గ్రామాలతో అతి పెద్ద సంఘం ఉందని దీనిని విభజిస్తే రైతులకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అంశం పై వినయ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ గుండారం శేఖర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణకు పాటుపడాలి

- డిప్యూటీ రేంజ్ అధికారి తుకారాం రాథోడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణ, అగ్నిప్రమాదాల నియంత్రణకు నిరంతరం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఇందల్‌వాయి డిప్యూటీ రేంజ్ అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. బుదవారం ఇందల్‌వాయి ఆటవీశాఖ ఆధ్వర్యంలో వనదర్శిని కార్యక్రమం ఇందల్ వాయి రేంజ్ పరిధిలోని చల్లగర్గ గ్రామంలో అటవీ ప్రాంతంలో అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణ, అగ్ని నియంత్రణ కార్యక్రమం సందర్భంగా ప్రజలకు, పాఠశాల విద్యార్థులను వనదర్శిని పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ... అటవీ రక్షణ దాని ప్రాధాన్యత తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు చేపడుతున్న చర్యలను వివరిస్తూ అడవుల్లో నిప్పు పడకుండా చేపట్టే చర్యలను వివరించారు. రోజు రోజుకు అంతరించి పోతున్న అడవులకు జీవం తీసుకుని రావడానికి ప్రతి ఒక్కరూ.. తమ వంతు కృషి చేయాలని కోరారు. కొందరు గుట్టు చప్పుడు కాకుండా అడవిలో ఉండే వన్యప్రాణులను వేటాడడం నేరమని దానిని నియంత్రించడానికి ప్రజలు సహకారం అందజేస్తూ రక్షించే విధంగా చూడాలని సూచించారు. అడవులు ఉంటే మానవ మనుగడకు బాగుంటుందని, అడవులు తగ్గితే రాబోవు తరాలకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు వినయ్, ఖాదీర్ బెస్ క్యాంప్ సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెంగాణ-మోపాల్

మండలంలోని ముదక్‌పల్లి, నర్సింగ్‌పల్లి, కస్బాగ్ తాండ గ్రామా లకు చెందిన లక్ష్మి, భూమ న్న, సతీష్ తదితరులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, మన గౌరవ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అనుక్షణం పేదల గురించి ఆలోచిస్తూ కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గాని వెంటవెంటనే పేదలకు అందించే విధంగా అండగా ఉంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్ఐ వి.రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు బృందం పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రజనీకాంత్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా యువతి, యువకులు జాగ్రత్తలు వహించాలని అన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి అడిగితే ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులకు సూచించిన అంశాలను తల్లిదండ్రులతో చర్చించుకోవలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.గంగారాం, సైబర్ వారియర్ కానిస్టేబుల్ సాగర్, మహిళా కానిస్టేబుళ్ల గంగామణి, కావేరి, సౌమ్య పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు..

పురస్కారం, అవార్డు అందుకున్న ఇరువురికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పద్మశాలి సంఘం 5వ తర్ప అధ్యక్షులు సైబా సుధాకర్, వారి కమిటీ ఆధ్వర్యంలో ఇటీవలే కళా రంగంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో అవార్డు అందుకున్న చౌక లింగం , జాతీయస్థాయిలో సేవారంగం ద్వారా భారత సేవారత్న పురస్కారం అందుకున్న పట్వారి తులసి కుమార్ ను సన్మానించి, జ్ఞాపికను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కొండ గంగాధర్, కోశాధికారి క్యాతం లక్ష్మణ్, నరేందర్, సుధాకర్ , రమేష్ గోపికృష్ణ , శేఖర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

పాఠశాలలే భవిష్యత్తుకు మెట్లు

- ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్ రూరల్

పాఠశాలలే భవిష్యత్తుకు మెట్లు అని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు విద్యాభివృద్ధిని స్వయంగా పరిశీలించారు. వచ్చే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు తెలియజేశారు. 100శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, స్టోర్ రూమ్, పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వామి, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

స్కాలర్స్ ఒలంపియాడ్ పాఠశాలలో సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లిలో స్కాలర్స్- ఒలింపియాడ్ ప్లే స్కూల్లో పింక్ బ్లూ డే బుధవారం నిర్వహించారు. ఆటపాటల్లో విద్యారులందరూ పింక్ డ్రెస్ ఎంతో ఉత్సాహంగా పాల్గోన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వేణు మాట్లాడుతూ పింక్ కలర్ ఏ విధంగా ఏర్పడుతుందో అని వివరిస్తూ, ఆవశ్యకతను వివరించినారు.. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఒడ్డెన్న,, ఇన్చార్జ్ సహస్ర, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు,

సౌత్ ఇండియా యూనివర్సిటీ కెప్టెన్‌గా కలిగోట్ పూర్వ విద్యార్థిని

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థిని భవాని సౌత్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కెప్టెన్‌గా ఎంపికైనట్టు పీడి యాదగిరి బుధవారం తెలిపారు. ఈనెల 7 నుంచి 11వరకు చెన్నైలో జెప్పియర్ యూనివర్సిటీలో వాలీబాల్ పోటీలు జరుగుతుందన్నారు. భవాని ప్రస్తుతం గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో తృతీయ సంవత్సరం చదువుతుంది. సౌత్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికైనందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు సువర్ణ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అభినందించారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

- జిల్లా ఇంటర్ అధికారి రవికుమార్

నవతెలంగాణ-ఆర్మూర్



మొక్కను నాటుతున్న జిల్లా ఇంటర్ అధికారి రవికుమార్, పలువురు

విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ ఆదేశించారు. బుధవారం పట్టణ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో తరగతి గదులను సందర్శించారు. పిన్సిపల్ నుస్రత్ జహాన్, అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని, ప్రతి రోజు విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ, దృష్టిని కొనసాగించాలని అన్నారు. మారుమూల ప్రాంతాల నుంచి వస్తున్న పేద, బడుగు, బలహీన, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే విధంగా విద్యాబోధన చేయాలని అన్నారు. కళాశాల పరిసరాలను తనిఖీ చేసి ఆవరణ పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలను పెంచి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డ్రగ్స్‌పై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. 2024 - 25 విద్యా సంవత్సరం రానున్న వార్షిక పరీక్షలకు అధ్యాపకులు 90 రోజుల ప్రణాళిక ప్రకారం బోధన చేసి, ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలను సాధించాలని ఆదేశించారు. రాబోయే ఇంటర్ ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు వెనుకబడిన బడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు తో పాటు, వారు కూడా ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో నడుపుతున్న

నారాయణ కళాశాల గుర్తింపును రద్దుచేయాలి

- డీఐఈవో కార్యాలయంలో విద్యార్థి సంఘాల వినతి
- ర్యాంకులు, అడ్మిషన్‌కు డిస్కంట్ పేరుతో అదనంగా వసూళ్లు
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



వినతి పత్రాన్ని అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అడ్మిషన్ నోటిఫికేషన్ రాకముందే డిస్కౌంట్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసంచేస్తున్న నారాయణ జూనియర్ కాలేజ్ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిఐఈఓ కార్యాలయంలో ఏఐపిఎస్యూ, ఏఐఎఫ్డిఎస్, టిజీవిపి, జీవిఎస్, ఏఐఎస్బీ విద్యార్థి సంఘాలుగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐపిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు బోడ అనిల్ మాట్లాడుతూ.. నారాయణ జూనియర్ కాలేజ్ ప్రభుత్వం అడ్మిషన్ నోటిఫికేషన్ ఇవ్వకముందే డిస్కౌంట్‌ల పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తోందన్నారు. దీనితోపాటు రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో కళాశాల నడిపిస్తూ విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ జూనియర్ కాలేజ్ గుర్తింపును రద్దు చేయాలని తెలిపారు. దీనితోపాటు తప్పుడు ర్యాంకులతో పాంప్లెంట్ ప్రింట్ చేసి ఎక్కడో వచ్చిన ర్యాంకులను నిజామాబాద్ క్యాంపస్‌లోనే వచ్చాయంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. సుభాష్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పూర్తయిందంటూ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. అడ్మిషన్ తీసుకుంటే 10వేలు డిస్కౌంట్ అంటూ అదనంగా వసూలు చేస్తున్న నారాయణ యాజమాన్యం నిజామాబాద్ బ్రాంచ్‌లో ఉన్న బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టి నారాయణ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్డిఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్, టీజీవిపి జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్, టీవియువి రాష్ట్ర అధ్యక్షులు లాల్ సింగ్, జీవీఎస్ జిల్లా అధ్యక్షులు జైత్రం రాథోడ్, ఏఐఎస్బీ రాష్ట్ర నాయకులు రాహుల్, రవీందర్ గౌడ్, ఏఐపిఎస్యూ గోపాల్ సింగ్ ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు అమలులో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం నాయక్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఈ (ఏఐఎస్ఎఫ్) నిజామాబాద్ జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశం ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి అధ్యక్షతన రైల్వే స్టేషన్ దగ్గర ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. అనంతరం పత్రిక విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం నాయక్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల, సంక్షేమ హాస్టల్లో, ప్రభుత్వ స్కూల్లో, మోడల్ స్కూల్ ,కస్తూరిబా గాంధీ పాఠశాల లో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం సంతోషకరమైన విషయం అని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్, చార్జీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని ఆయన అన్నారు. వంటలు తయారు చేయడానికి అవసరమైన వంట సామాగ్రి లేకపోవడం, ఏ సంక్షేమ హాస్టల్లో చూసిన వందమంది విద్యార్థులు ఉంటే ముగ్గురు వంట మనుషులు ఉండటం వల్ల టైంకి నాణ్యమైన భోజనాలు పెట్టడంలో లేట్ అవుతుందని అన్నారు. ఇప్పుడు వచ్చిన మెనూకు కనీసం వంద మంది విద్యార్థులకు 8 మంది కుకింగ్ చేసేవాళ్లు ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇప్పుడు ఉన్న మెనూకు రోజువారి ఇడ్లీ, దోశ, చపాతి, పూరి, ఇతర పదార్థాలను తయారు చేయడం సాధ్యం కావట్లేదని కాబట్టి విద్యార్థులకు సరిపడా వంట మనుషులను పెట్టాలి అదేవిధంగా వంట సామాగ్రి అవసరమైనటువంటి పరికరాలను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని విద్యార్థులకు సమయానికి ఆరోగ్యకరమైన భోజనం అందించే విధంగా చూడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవి అమలు చేయకపోతే భవిష్యత్తు కాలంలో విద్యార్థులతో కలసి ఆందోళన చేపడతామని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సమావేశంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి నాయకులు కుషాల్, సుభొద్,టోకు పాల్గొన్నారు.

నేడు మైనారిటీ కమిషన్ చైర్మన్ రాక

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ ఈ నెల 9న (గురువారం) నిజామాబాద్ పర్యటనకు విచ్చేస్తున్నారని అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. ఉదయం 10గంటలకు జిల్లా అధికారులతో సమావేశం అవుతారని, అనంతరం మధ్యాహ్నం 2గంటల వరకు మైనారిటీ వర్గాల వారి నుండి విజ్ఞాపనలు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాదు అర్బన్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల పైన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా సమావేశమైనారు. నాగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మరమ్మతులకు విడుదలైన 1.25 కోట్ల రూపాయలతో వెంటనే పనులు ప్రారంభించి అర్హులైన లబ్దిదారుల జాబితా కొత్తగా ఎంపిక చేసి వారికీ ఇండ్లను కేటాయించాలని సూచించారు. నగర ప్రజా ఆరోగ్యం, అవసరాలకు అనుగుణంగా నిర్మించిన అహ్మది బజారు, ఖలీల్ వాడిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల పనులు అతి త్వరలో పూర్తి చేసి ప్రజాపయోగంలోకి తీసుకొచ్చే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీయు ఎఫ్ఐడిసి ఫండ్ కింద నియోజకవర్గనికి విడుదల అయిన 60 కోట్ల రూపాయలకు టెండరింగ్ పిలిచి త్వరతగతిన డివిజన్ల వారిగా పనులు ప్రారంభించాలని కోరారు. నగరంలో కబ్జాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫుట్ పాత్ కబ్జాలు, రోడ్లపై విచ్చలవిడిగా వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. తోపుడు బండ్లతో రోడ్ల పై వ్యాపారం చేస్తున్న వారికీ ప్రత్యేకంగా ఒక స్థలం కేటాయించాలని సూచించారు. స్మార్ట్ సిటీ కోసం కేంద్ర నాయకత్వంతో ఎంపీతో కలిసి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్మార్ట్ సిటీ విధివిధానాలకు అనుగుణంగా ఇందూర్ నగరాన్ని తీర్చిదిద్దే బాధ్యత అందరిపైన ఉందని అందుకు ప్రజలందరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్అండ్బీ డిపార్ట్మెంట్ ఈఈ సురేష్, డిఈ ప్రవీణ్, మున్సిపల్ ఈఈ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్



శబరిమలకు వెళ్తున్న కన్నె స్వామి బబ్లూకు పట్టణంలోని లైన్మెన్ సంతోష్ 2005 రూపాయలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాది కన్నె స్వాములకు తన వంతుగా ఆర్థిక సాయం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, కౌన్సిలర్లు తాటి హనుమండ్లు, జహీర్ అలీ, విజయ్ స్వామి పాల్గొన్నారు.

7న వెయ్యి గొంతులకు.. లక్ష డప్పుల కార్యక్రమం

- ఎంఆర్‌పీఎస్

నవతెలంగాణ-బాల్కొండ

"ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7 నాడు జరిగే వెయ్యి గొంతుకలు.. లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇంజం వెంకటస్వామి మాదిగ అన్నారు.ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం బుధవారం మండల కేంద్రంలోని పాండురంగ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఉంగరాల రాజేశ్వర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజం వెంకటస్వామి మాదిగ మాట్లాడుతూ బాల్కొండ మండలంలోని ప్రతి గ్రామం నుంచి వేలాదిగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ "30 ఏండ్లుగా మంద కృష్ణ మాదిగ మాదిగల కోసం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం చేస్తున్నాడని, ఇప్పుడు వర్గీకరణ పోరాటం చివరి దశలో ఉందని అన్నారు. ఫిబ్రవరి 7న జరిగే వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా నుంచి 10 వేలకు పైగా డప్పులు తరలాలని పిలుపునిచ్చారు. బాల్కొండ మండలం నుంచి వచ్చే ప్రతి నాయకుడు, కార్యకర్త జబ్బకు డప్పు వేసుకొని రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంఎస్‌పి రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకట స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు తెడ్డు గంగారాం, ఎంఎంఎస్ జాతీయ నాయకులు యమున మాదిగ, సత్తెక్క, సుధా మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం రాజేష్ మాదిగ, ఎం ఆర్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లాసింగారి భూమయ్య మాదిగ, జిల్లా కార్యదర్శి ప్రదీప్ మాదిగ, ఎమ్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు కనక శ్రీదీప్ మాదిగ పాల్గొన్నారు.

జనం గొంతుక నవతెలంగాణ



నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

నవతెలంగాణ 2025 క్యాలెండర్‌ను భీంగల్ సిఐ నవీన్, చరిత్ర గ్రంథ రచయిత, మాజీ కల్చరల్ జర్నలిస్ట్, ప్రముఖ కవి కంకణాల రాజేశ్వర్ చేతుల మీదగా బుధవారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. నవతెలంగాణ పత్రికకు మంచి ఆదరణ లభించాలని, నేటి పోటీ ప్రపంచంలో మిగితా పత్రికలకంటే ధీటుగా ఎదగాలని ఆకాంక్షించారు. పత్రికలు నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని, అందులో నవతెలంగాణ పాత్ర ప్రత్యేకమైనదని అన్నారు. ప్రజలకు, పాలకులకు వారధిగా పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎలాంటి అవరోధాలు, ఇబ్బందులు రాకుండా ప్రజలందరూ నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని, నాయకులకు, అధికారులకు, ప్రజలకు, పత్రిక సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

'మగువ' పుస్తకావిష్కరణ



మగువ పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో బుధవారం ఉదయం 'మగువ' పుస్తకావిష్కరణ కార్యక్రమం జీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ, లయన్స్ క్లబ్ సభ్యులు సంయుక్తంగా కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సిద్ధ రమేష్ మాట్లాడుతూ.. ముప్కాల్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ప్రముఖ కవి, రచయిత అయిన తొగర్ల సురేష్ రచించిన 'మగువ' పుస్తకంను ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు తొగర్ల సురేష్ ను ఘనంగా సన్మానించారు. ఎస్సై వి.రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సైతం సురేష్ ను అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పుస్తక ప్రియులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుచేయాలి

- మామిడి విట్టల్

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రవ్యాప్తంగా పేద మధ్యతరగతి బడుగు బలహీనవర్గాల విద్యార్తులే ప్రభుత్వ కళాశాలల్లో చదుకుంటారని,వారిపట్ల ప్రభుత్వం మధ్యన భోజనం అందించే విధంగా ఆలోచన చెయ్యాలని తెలంగాణ బిసి లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విట్టల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ కళాశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలుచేయడం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాకుండా జూనియర్ కళాశాలలు మంచి పురోగతిని సాధిస్తాయని అన్నారు. ప్రభుత్వం చొరవతీసుకొని ఇంటర్ కలశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కళాశాలలు మండలకేంద్రాల్లో ఉండటంవల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మంచి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లవుతుందని సూచించారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం 2025 క్యాలెండర్ ను బుధవారం ఆవిష్కరించారు. మండల విద్యాధికారి ఆంధ్రయ్య, మండల నోడల్ అధికారి గంగాధర్ చేతుల మీదుగా తపస్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, తపస్ మండల అధ్యక్షులు కిషన్, ప్రధాన కార్యదర్శి రమేష్, డివిజన్ కార్యదర్శి శంకర్, ఆనంద్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోటాడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సంఘం సభ్యులు

నవతెలంగాణ-మోపాల్

బోర్గాం(పి) శివారులో గల కళ్యాణ మండపంలో బోర్గాం గ్రామ మొట్టడి రెడ్డి సంఘం క్యాలెండర్‌ను సంఘం సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు సాయిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శివ ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూమారెడ్డి, లక్పత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాలలో షీ టీమ్ అవగాహనా సదస్సు

నవతెలంగాణ-బోధన్ టౌన్



ఉషోదయ మహిళా డిగ్రీ కాలేజ్‌లో షీ టీమ్ అవగాహన కార్యక్రమాన్ని విజయ్, గౌతమిల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మహిళలపై జరిగే నేరాల గురించి, టి-సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, జెజె చట్టం, సైబర్ నేరాలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ టౌన్, ఎస్‌హెచ్‌ఓ వెంకట్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్ (రాజంపేట్)

100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డిఎల్‌పిఓ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి నవీన్‌కు సూచించారు. బుధవారం రాజంపేట్ మండలంలోని గుడితాండ గ్రామంలోని గ్రామపంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిరంతరం జరిగేలా చూడాలని, గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డి.ఎల్.పి.ఓ సురేందర్, ఎంపీడీవో రఘురాం, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఉత్తీర్ణత లక్ష్యంగా 90 రోజుల ప్రణాళిక

- ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న
- కళాశాలల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్/బాల్కొండ

90 రోజుల ప్రతిష్టాత్మక ప్రణాళికతో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు వెళ్లేందుకు ఇంటర్ బోర్డు కృషి చేస్తుందని నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య ప్రత్యేక అధికారి(90 రోజుల ప్రణాళిక స్పెషల్ ఆఫీసర్) తెలిపారు. బుధవారం ఆయన ఆర్మూర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయానంద్ రెడ్డి, రాజీయుద్దిన్ అస్లాం, ఇంటర్ విద్య అధికారి రవికుమార్ పాటు కళాశాలల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడ్డెన్న ఆయన మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు తమ వ్యక్తిగత ఫలితాలను మాత్రమే ఇప్పటివరకు చూసుకుంటున్నారని, దీనివల్ల గ్రూపు ఉత్తీర్ణత శాతం, కళాశాల ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని అన్నారు. ఇకముందు తమ గ్రూపులకు సంబంధించిన ఇతర సబ్జెక్టుల అధ్యాపకులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి విద్యార్థిపై వ్యక్తి గత శ్రద్ధ కనబరుస్తూ విద్యాబోధన చేయాలని ఆదేశించారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థులను విభాగాలుగా విభజించి దత్తత తీసుకుని విద్య బోధన చేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ప్రతి గ్రూపులో చేరి ఫీజు చెల్లించిన విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గితే ఇంటర్ బోర్డు అధ్యాపకుల పై చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అధ్యాపకుల బోధన తీరు తోపాటు, కళాశాలకు హాజరవుతున్న విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల మార్కుల వివరాల నమోదు, వార్షిక పరీక్షలలో సాధించాల్సిన వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయన దిశా, నిర్దేశం చేశారు. ఇకపై అధ్యాపకులు సమన్వయంతో ముందుకు వెళ్ళనట్లయితే ఇంటర్ బోర్డు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని హెచ్చరించారు. చదువులో వెనుకబడిన, కళాశాలకు రెగ్యులర్గా రాని విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు వారిఇ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులుగా తయారు చేసేందుకు 90 రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేసి వారిని ఊతీర్ణులయ్యేలా చూడాలని అన్నారు. ప్రతి అధ్యాపకుని పనితీరును ఆయన సమీక్షించి, అంచనా వేశారు. కళాశాలకు రాని విద్యార్థులను కచ్చితంగా రప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు, సలహాలు చేశారు.

పేద, మధ్య తరగతి, వెనకబడిన తరగతుల కులాల, మైనారిటీ వర్గాల విద్యార్థులను వారి స్థితిగతులను, పరిస్థితులను అంచనా వేస్తూ సబ్జెక్టులను బోధించెందుకు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం ప్రతి అధ్యాపకుడు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయం పై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు ఖచ్చితంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులకు మానసిక ధైర్యాన్ని పెంపొందించాలని అన్నారు. పరిస్థితులలో మార్పులు రాకపోతే ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తానని హెచ్చరించారు. వచ్చే ప్రయోగ పరీక్షలను, వార్షిక పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధ్యాపకులు విద్య బోధన పై శ్రద్ధ వహించాలని అన్నారు. వచ్చే ప్రీ ఫైనల్ పరీక్షల నాటికి ప్రతి విద్యార్థి కి తాము ఉత్తీర్ణులవుతామన్న భరోసాను కల్పించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని అన్నారు. ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ కళాశాలల ఆవరణలో చెత్త చెదారం తొలగించాలని ఆదేశించారు. కళాశాల కార్యాలయ సిబ్బంది ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కార్యాలయ ఫైల్ లు, రిజిస్టర్లన్నీ కూడా పూర్తి చేయాలని



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఒడ్డెన్న



ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు దొర్లకుండ విద్యార్థుల భవిష్యత్తు దష్టిలో ఉంచుకునీ పని చేయాలన్నారు. అవసరమైన సూచనలు, సలహాలు తీసుకుని జాగ్రత్తగా ప్రతి అంశాన్ని క్రోడీకరించాలని అన్నారు. విద్యార్థుల డేటాను సరిచేసుకునేందుకు సబ్జెక్టులు మార్చుకునేందుకు, ఫోటో సంతకము తప్పిదం దొర్లితే సరిదిద్దుకోవడానికి ఇంటర్ బోర్డు మరో అవకాశం ఇచ్చిందని క్షుణ్ణంగా పరిశీలించి డేటాను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ అన్నారు. నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ, పాలనాపరమైన అనుమతులు, పరీక్ష ఫీజుల వసూలు, ఇతర అన్ని రిజిస్టర్ లను తనిఖీ చేశారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సూచించిన మేరకు ప్రణాళిక బద్ధంగా బోధన నిర్వహణ జరగాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశాలలో ప్రిన్సిపాల్ విజయనంద్ రెడ్డి, రజియుద్దీన్ అస్లాం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ప్రత్యేక అధికారి శ్రీ ఒడ్డెన్న, ఇంటర్ విద్య అధికారి శ్రీ రవికుమార్ మొక్కలు నాటారు.

చైన్ స్నాచర్ అరెస్టు

- బంగారు గొలుసు రికవరీ
- 24 గంటలో చేధించిన పోలీసులు

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని నందిగామ గ్రామంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నవీపేట ఎస్సై వినయ్ కుమార్ బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ శ్రీనివాస్, ఎస్ఐ వినయ్ కుమార్ మాట్లాడారు. మండలంలోని నందిగాంకు చెందిన ఇందూర్ గంగామణి మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు మోటార్ సైకిల్‌పై వచ్చి రెండున్నర తులాల బంగారు గొలుసును సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఎత్తుకెళ్లాడు. మంగళవారం నవీపేట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీ వెరిఫికేషన్, టెక్నాలజీ ద్వారా నిందితుడైన గంగాధర్‌ను మండల కేంద్రంలోని శివాజీ చౌక్ దగ్గర వెహికల్ చెకింగ్ చేస్తుండగా పట్టుకున్నారు. ఆయన వద్ద నుండి బంగారు గొలుసు, మోటార్ సైకిల్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. 24 గంటల్లోనే చోరీ కేసును చేదించినందుకు ఎస్సై వినయ్ కుమార్, సహకరించిన క్రైమ్ పార్టీ పోలీసులను అభినందించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్సై విక్రం బుధవారం అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఓటిపిల ద్వారా వివిధ వాటి ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థులు వాటిపై అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలు పాటించాలని వీటితోపాటు తమ తల్లిదండ్రులకు సైబర్ నేరాలపై వివరిస్తూ గుర్తుతెలియని వ్యక్తులు పంపించే వాటి ఓటీపీలను ఎవరికి చెప్పకుండా ఉండేలా తెలపాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిజం సఫాయి పని లాంటిది

- సఫాయి కార్మికులతో నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ..



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్యదర్శి, సఫాయి కార్మికులు

నవతెలంగాణ- నవీపేట్

సమాజంలో జర్నలిజం సఫాయి పని లాంటిదని నవీపేట్ కార్యదర్శి రవీందర్ నాయక్ అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సఫాయి కార్మికులతో కలిసి బుధవారం నవ తెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అవినీతి, అక్రమాలను వెలికి తీసి నవ సమాజ స్థాపనకు జర్నలిజం కృషి చేయాలని ఆకాంక్షించారు. అనుదినం జన స్వరంగా పనిచేస్తూ ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా కృషి చేస్తున్న నవ తెలంగాణ పత్రిక 2025 నూతన క్యాలెండర్‌ను సఫాయి కార్మికులతో ఆవిష్కరించడం ఎంతో గౌరవంగా ఉందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్ అన్నారు. కార్మిక, కర్షక, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తున్న నవ తెలంగాణ భవిష్యత్తులో మరింత అభివద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నవ తెలంగాణ విలేకరి జాదవ్ శరత్, గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, శ్రావణ్, కవిత, గంగాధర్, సుంకరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులైన వయోవృద్ధులను రాంపూర్ ప్రభుత్వ వృద్ధాశ్రమంలో చేర్పించాలి

- జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ అధికారి రసూల్ బి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిరాశ్రయులైన వయోవృద్ధులను రాంపూర్‌లో గల ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించుటకు కృషి చేయాలని జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు వసతి కల్పించుటకుగాను డిచ్ పల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వృద్ధాశ్రమం నిర్మించిందని, ప్రజా ప్రతినిధుల, జిల్లా అధికారుల వయో వృద్ధుల పోషణ చట్టం జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వృద్ధాశ్రమం నిర్వహణకు జిల్లా యంత్రాంగం, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ, నిజామాబాద్ యంఓయు చేసినట్టు పేర్కొన్నారు. వృద్ధాశ్రమంలో కేవలం నిరాశ్రయులైన వయో వృద్ధులకు తేది 10-01-2025 నుండి వసతి కల్పిస్తారని తెలిపారు. జిల్లాలో గల వయో వృద్ధుల పోషణ చట్టం జిల్లా కమిటీ సభ్యులకు మరియు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్, ఫోరమ్స్, ట్రస్టుల అధ్యక్షులకు ఇతర సభ్యులను, సమగ్ర శిశు పథక అభివృద్ధి అధికారిణులకు, అంగన్వాడీ సూపర్వైజర్లను, అంగన్వాడీ టీచర్లను తమతమ పరిధిలోగల నిరాశ్రయులైన వయో వృద్ధులను రాంపూర్ లో గల ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించుటకు కృషి చేయవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు చైర్మన్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ, నిజామాబాద్ ఫోన్ నం. 9849933300 లేదా వృద్ధాశ్రమ కో-ఆర్డినేటర్ ఫోన్ నం. 96188 44461 లేదా జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

వీఆర్‌కే విద్యార్థికి రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి

నవతెలంగాణ-కామారెడ్డి



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర యువజన శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర యువజన ఉత్సవాల్లో భాగంగా వివిధ పోటీలలో భాగంగా నిర్వహించిన డిక్లమేషన్ (ఉపన్యాస) పోటీలలో విఆర్‌కే జూనియర్ కళాశాలలో బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎ.పూర్వజ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం గెలుచుకొని జాతీయ స్థాయికి ఎంపికైందని ఆర్కే సీఈవో డాక్టర్ జైపాల్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువజన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్మిత సబర్వాల్ ఐఏఎస్ ప్రశంసాపత్రాలు అందజేశారు. జనవరి 12న వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయస్థాయిలో ఢిల్లీలో నిర్వహించే జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రం తరఫున ఉపన్యాసించడానికి వీఆర్కే విద్యార్థి ఎంపికైందన్నారు. అదేవిధంగా ఫోక్ డ్యాన్స్ విభాగంలో విఆర్కే నుంచి శాలిని, రశ్మిత గ్రూప్, పోయెట్రీలో ఆర్కే నుంచి హర్షిని, ఎస్సార్కే నుంచి డ్రాయింగ్‌లో మైత్రేయిలు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచారని ఈ సందర్భంగా పూర్వజ, విద్యార్థి బృందాన్ని అధ్యాపకులను అభినందించారు. ఈ విజయం పట్ల ఆర్కే డీన్ నవీన్‌కుమార్, కోఆర్డినేటర్ దత్తాత్రి, ప్రిన్సిపల్స్ సైదయ్య, శంకర్, శివాజీరావు, శ్రీవాణి అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

- కృష్ణవేణి హైస్కూల్ ఆధ్వర్యంలో అవగాహన

నవతెలంగాణ-నందిపేట్

ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ బండిరామాగౌడ్ అన్నారు. ఓటు హక్కు వినియోగంపై మండలకేంద్రంలోని ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్ల కార్డులు చేతబట్టుకొని నినాదాలను చేస్తూ పాఠశాల నుండి చాకలి ఐలమ్మ బస్టాండ్ పాతూర్ వరకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఓటు గురించి, ఓటు హక్కుగురించి నత్య ప్రదర్శన, నాటికల ద్వారా మంచి వివరించారు. ఈప్రదర్శన చూపరులను ఆకట్టు కుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వర్ మాట్లాడుతూ 18 సంవత్స రాలు నిండిన ప్రతి ఒక్కరు. ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోబాలకు లొంగకుండా ఉండాలని, ఓటు అనేది రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని అన్నారు. మంచి నాయకుణ్ణి ఎన్నుకుంటే దేశం అభివద్ధి పథంలో ఉంటుందని. విద్య, వైద్యం రక్షణ రంగాల్లో అభివద్ధి జరిగినప్పుడే దేశం అభివద్ధి భాటలో నడుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల యాజమాన్యం బండి రామాగౌడ్, మాధురి అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు యువతకు స్ఫూర్తి దాయకంగా ఉంటాయని, ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ప్రోత్సాహంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్, గంగాప్రసాద్, వినోద్ షాహిన్, ధర్మపురి, శరల్, దివ్య, సరిత, ప్రేమల ఆసిఫ్, తిరుమలేష్, చందు. విద్యార్థులు పాల్గొన్నారు.



నాటక ప్రదర్శన ద్వారా ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



పాల్గొన్న స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

అవసరం మేర యూరియాను వాడండి

- వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రైతులు అవసరం మేర యూరియాను వాడుకోని అధిక దిగుబడి సాధించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ కుమార్ సూచించారు. బుధవారం ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామంలోని సహకార సొసైటీలో యూరియా ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పదివేల 400 ఎకరాల వరకు వరి పండిస్తున్నారని, 500 ఎకరాల్లో మక్కలు, 30 ఎకరాల్లో శనిగలు సాగు చేస్తున్నారని ఆయన అన్నారు. మండలంలో 15 2 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా మొదటి విడతలో 8 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని రెండో విడత గ రావాల్సి ఉందన్నారు. అవసరాల రిత్యా యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా అధికంగా వాడితే గాలి, నీరు, కాలుష్యం అవుతుందని చివరకు తల్లిపాలు కాలుష్యం అవుతాయని వివరించారు. ధాన్యపు పైర్లు విపరీతంగా పెరిగి పడిపోవడం, పూత ఆలస్యంగా వచ్చి పంటకాలం పెరగడటం, తాలు గింజలు ఏర్పడటం జరుగుతుందని తెలిపారు. బెల్లం దగ్గరకు చీమలు చేరినట్లు అధికంగా యూరియా వాడిన పంట చేలా దగ్గరికి చీడపీడలు సులభంగా చేరుతాయని పేర్కొన్నారు. ఆర్థిక పెట్టుబడులు పెరగడం దిగుబడి తగ్గిపోవడం జరుగుతుందని దానికోసం రైతులు అధిక యూరియా వాడి నష్టపోవద్దని సూచించారు. ఆయనవెంట సిఈఓ ఉప్పల్ వాయి రతన్, శ్రీకాంత్,రవి ఉన్నారు.



యూరియాను పరిశీలిస్తున్న ఏవో శ్రీకాంత్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేయాలి
- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్

నవతెలంగాణ-లింగంపేట్

ప్రతి కార్యకర్త స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మోతే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశంలో రాబోయే సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థగా ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులకు భారీ మెజార్టీతో గెలిపించి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోతే గ్రామ మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, లింగంపేట్ మండల యూత్ అధ్యక్షుడు రాజు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, బైరయ్య, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మోతే గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైల్వే గేటు వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర టూ వీలర్స్ బైక్ మెకానిక్ షాప్‌లో దొంగతనం జరిగిందని ఎస్ హెచ్ ఓ మోహమ్మద్ షరిఫ్ తెలిపారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు పల్సర్ ద్విచక్ర వాహనాలను దొంగిలించుకు పోయారని, బుధవారం పొద్దున్నే మెకానిక్ షాప్‌లో పనిచేసే ఈనాల సాయికుమార్ బైక్ మెకానిక్ షాప్ దగ్గరికి వచ్చి చూడగానే షాప్‌లో గల రెండు ద్విచక్ర వాహనాలు కనబడలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిట్లు ఎస్‌హెచ్‌ఓ మొహమ్మద్ షరీఫ్ తెలిపారు.

కృష్ణజివాడి రెడ్డి కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామరెడ్డి కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కార్యదర్శి బద్దం గోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. అధ్యక్షులుగా బద్దం అన్వేష్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్‌బి.శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారులుగా మరికొందరిని ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

- సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘంలో రైతుల కోసం రసాయనిక ఎరువులు అందుబాటులో ఉన్నాయని సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి తెలిపారు. రైతులకు కావాల్సిన డిఎపి, బీస్‌బీస్, యూరియా ఇతర ఎరువులు నిలువ ఉన్నట్టు సూచించారు.

వర్గ బేధం లేకుండా పనిచేయాలి

నవతెలంగాణ-తాడ్వాయి

వర్గ బేధాభిప్రాయాలు లేకుండా పార్టీలో పనిచేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఎర్రపహాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులతో పాటు ఎంపిటిసి, జడ్పిటిసి బిఫాం ఎమ్మెల్యే ఆదేశాల మేరకే అందజేయనున్నట్టు తెలిపారు. ఎవరికి వచ్చిన ఏకంగా ఉండి గెలిపించుకోవాలని సూచించారు. మాజీ సీడీసీ చైర్మన్ మద్ది మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమీర్ శ్యాంరావు, ఉపాధ్యక్షులు లక్ష్మణ చారి, గైని శివాజీ, బండారు సంజీవ్, మేకల రాజు, జలంధర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, గైని రాజలింగం, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నా

ఆరోగ్యాలను కాపాడుకోవాలి



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, టోల్‌ప్లాజా మేనేజర్లు

టీం లీడర్ విజయ్‌గుప్త

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జాతీయ రోడ్డు భద్రత ఉత్సవాల్లో భాగంగా నెలరోజులపాటు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగానే ఇందల్ వాయి మండల కేంద్రంలోని అత్వంగ్ డిచ్ పల్లి టోల్వే ప్రైవేట్ లిమిటెడ్ ఇందల్ వాయి టోల్ ప్లాజా సిబ్బందికి, ప్రజలకు ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ గుప్తా, ప్రభుత్వ ఆసుపత్రి ఇన్చార్జి వైద్యులు తుకారం రాథోడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మా ఆరోగ్యాల సంరక్షణకు వైద్యులు చూపించిన విధంగా మందులను వాడే విధంగా చూడాలని అన్నారు. రహదారులపై రాకపోకలు సాగించే సమయంలో అప్రమత్తంగా ఉంటూ నియమ నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు వాహనదారులు సీటు బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి లేని ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీ రామారావు, ప్రాజెక్టు మేనేజర్ అనిల్ కుమార్ సింగ్, టోల్ ప్లాజా మేనేజర్ చలపతిరావు, సేఫ్టీ మేనేజర్ సతీష్, రూట్ మేనేజర్ విరాజ్ దేశ్ పాండే, సంతోష్ రెడ్డి, పలు గ్రామాలకు చెందిన వైద్యులు, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, వెంకట్ రెడ్డి, ఆనంద్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐసిటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా జబ్బర్ ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

ఈనెల 5, 6 తేదీల్లో ఆల్ ఇండియా అఖిల భారత సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాలు మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండల కేంద్రంలో నిర్వహించగా.. ఈ సమావేశాల్లో జిల్లాకు చెందిన జబ్బర్ ఏఐసిటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని జగదాంబ తాండకు చెందిన భూక్య రాజు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా బుధవారం జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మద్దికుంట నర్సగౌడ్‌తో కలిసి బాధితుడికి సీఎంఆర్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ముఖ్య సలహాదారు షబ్బీర్ అలీ సూచన మేరకు చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రాతుల రెడ్డి నాయక్, ప్రధాన కార్యదర్శి రగోత్తం రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు బండి ప్రవీణ్, కుమ్మరి శంకర్, నాయిని నర్సింలు, కమ్మెళ నరేందర్, కిష్టరెడ్డి తదితరులు పాల్గొన్నారు.